క్లుప్తంగా

29న స్వర మాధురి

శ్రీకాకుళం కల్చరల్: ఈనెల 29వ తేదీన జీబీఏ స్వర మాధురి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో 'స్వర మాధురి' త్రివేణి సంగమం కార్యక్రమం వాకలవలస వద్ద ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి నిక్కు అప్పన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సినీ గాయకుడు జి.ఆనంద్ సోదరులు జి.వీ రాజు, బాలరాజుల పర్యవేక్షణలో రేజేటి సతీష్‌కుమార్ సహకారంతో, బందారు రమణ మూర్తి సంగీత సారథ్యంలో బాలు, ఘంటసాల, ఆనంద్ పాడిన గీతాలతో స్వర మాధురి నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

షెడ్ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న సవలాపురం రమణ

ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాక గ్రామంలోని పురాతన జగతిపుట్ట శివాలయం ముందు షెడ్ నిర్మాణాన్ని చేపట్టడానికి గ్రామానికి చెందిన సవలాపురం రమణ, సుధారాణి దంపతులు ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం రూ.50 వేల విరాళం అందించారు. కార్తీక మాసం వస్తుండడంతో శివాలయంలో పనులను చేపట్టడం జరుగుతోందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ నర్సుల కార్యవర్గ ఎన్నిక



నూతన కార్యవర్గమిదే

శ్రీకాకుళం: ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు బుధవారం ఏకగ్రీవంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో జరిగిన ఎన్నికల్లో డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు కె.దామోదరరావు, పి.జానకిరాంలు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. మూడేళ్ల కాలపరిమితికి గాను ఎంపికైన ఈ కార్యవర్గంలో అధ్యక్షులుగా పి.శాంతి కుమారి, (శ్రీకాకుళం, జీజీహెచ్ హెడ్ నర్సు), ఉపాధ్యక్షులుగా ఎస్.చిన్నమ్మడు (సీహెచ్‌సీ, బుడితి), కార్యదర్శిగా ఎల్.త్రినాథమ్మ (స్టాఫ్ నర్సు, నరసన్నపేట), కోశాధికారిగా పి.సత్యవతి (హెడ్‌నర్సు శ్రీకాకుళం, జీజీహెచ్), సభ్యులుగా టి.బేబీ, ఐ.కుశమకుమారి, టి.చంద్రకళ, పి.జగదాంబ, సీహెచ్ నిర్మల తదితరులు ఎన్నికయ్యారు.

బాల కార్మికుల నిర్మూలనే ధ్యేయం



షాపులను తనిఖీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: బాల కార్మికుల నిర్మూలనే ధ్యేయంగా పని చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసి నాయుడు అన్నారు. శ్రీకాకుళంలోని నెహ్రూ రోడ్డులో బాల కార్మికులను జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, కార్మికులుగా, సేవకులుగా ఉండకూడదన్నారు. బాల లను పనిలోకి తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. బాలల సంక్షేమం కోసం ప్రభుత్వం, చట్టాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యున్ని దర్శించుకున్న శ్రీనివాస్



శ్రీనివాస్‌కు ఆదిత్యుని జ్ఞాపిక అందజేస్తున్న ఈవో భద్రాద్రి

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామివారిని ఇన్‌కం టాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం ఆలయ అర్చకులు, ఆలయ ఈవో వై.భద్రాద్రి ఆయనకు ఘన స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆలయ విశిష్టతను వివరించి ప్రసాదాలను అందజేశారు.

ఇసుక ర్యాంపు రద్దు చేయండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న మైన్స్ సిబ్బంది

శ్రీకాకుళం రూరల్: తమ గ్రామంలో ఇసుక ర్యాంపును ఏర్పాటు చేయవద్దంటూ శ్రీకాకుళం రూరల్ మండలం కిల్లిపాలెం గ్రామస్తులు మైన్స్ అధికారుల వద్ద తేల్చిచెప్పారు. ఇటీవల గ్రామస్తులంతా కలిసి తమ గ్రామంలో ఇసుక ర్యాంపునకు అనుమతులు ఇవ్వవద్దంటూ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మైన్స్ అధికారులు బుధవారం గ్రామాన్ని సందర్శించారు. కిల్లిపాలెం ప్రాంతాన్ని ఆనుకుని నాగావళి నదీతీరంలో 2022-24 మధ్య ఇసుక తవ్వకాలు ఎక్కువగా జరిగినందున నీరు, ముగురునీరు, గోతులు ఎక్కువగా, ఇసుక నిల్వలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

ఉపాధికి భరోసా

- వివిధ రంగాల్లో నిరుద్యోగ యువతకు శిక్షణ
- ట్రైనింగ్ అనంతరం మెరుగైన ఉపాధి
- నిరుద్యోగులకు బాసటగా నిలుస్తున్న ఎచ్చెర్ల స్కిల్ కాలేజ్



పేషెంట్ రిలేషన్ అసోసియేట్ రంగంలో శిక్షణ పొందుతున్న యువత



థియరీ క్లాస్‌లను నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల:

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఎచ్చెర్ల మండల కేంద్రం సమీపంలోని సాంకేతిక శిక్షణాభివృద్ధి కేంద్రంలోని స్కిల్ కళాశాలలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణ ఇస్తున్నారు. సీడాప్ ఆధ్వర్యంలో పేషెంట్ రిలేషన్ అసోసియేట్, రిటైల్ డిపార్ట్‌మెంట్ తదితర రంగాల్లో మెలకువలు నేర్పిస్తున్నారు. శిక్షణలో భాగంగా కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్‌పై అవగాహన, ఇంగ్లీష్‌లో ప్రావీణ్యత, వైద్యరంగంలో నైపుణ్యతలను నేర్పిస్తున్నారు.

బ్యాచ్‌ల వారీగా శిక్షణ..

ఒక్కో బ్యాచ్‌కు 30 మంది చొప్పున పేషెంట్ రిలేషన్ అసోషియేట్, రిటైల్ డిపార్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు పది బ్యాచ్‌లలో 300 మంది శిక్షణ పొందారు. వీరిలో 220 మందికి వివిధ ఆస్పత్రులు, రిటైల్ డిపార్ట్‌మెంట్‌లలో ఉపాధి కల్పించారు. ప్రస్తుతం రెండు బ్యాచ్‌లుగా 60 మంది శిక్షణ పొందుతున్నారు. కోర్సులో భాగంగా ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు.

ఈ రంగాల్లో ఉపాధి..

శిక్షణ పూర్తిచేసుకున్నవారికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. పేషెంట్ రిలేషన్ అసోషియేషన్ రంగంలో ఇప్పటివరకూ కిమ్స్, మెడికవర్, విజయా డయాగ్నటీ సెంటర్, మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పిటల్ వంటి పలు ఆస్పత్రుల్లో ఉద్యోగాలు కల్పించారు. రిటైల్ డిపార్ట్‌మెంట్ మేనేజర్ రంగానికి సంబంధించి రిలయన్స్, వెస్ట్‌సైడ్, ఖజానా, కనిస్క జ్యూయలరీ, జుడో, రిలయన్స్ మార్ట్ వంటి రిటైల్ రంగాల్లో ఉపాధి కల్పించారు.

చదువు మధ్యలో మానేసిన వారికి..

టెన్త్, ఇంటర్మీడియట్, డిగ్రీ వరకూ చదువుకుని వివిధ కారణాలతో ఉన్నత చదువులు చదవని అభ్యర్థులు ఈ శిక్షణలు తోడుగా ఉంటున్నాయి. మహిళలు, అర్ధంతరంగా చదువు ఆపేసిన వారి ఇక్కడ ఎక్కువగా చేరుతున్నారు

మెలకువలు నేర్పిస్తున్నారు..



ఇక్కడ శిక్షణలో మెలకువలు నేర్చుకుంటున్నాను. ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ బాగా నేర్పిస్తున్నారు. శిక్షణ అనంతరం ఉపాధి పొంది ఇంటికి తోడుగా నిలవాలన్నదే ఆశ.

– ఐ.రాజశేఖర్, గురుగుబిల్లి, లావేరు మండలం

మెరుగైన శిక్షణ..



యువతకు అర్థమయ్యే రీతిలో మెరుగైన శిక్షణ ఇస్తున్నాం. కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాక్టికల్స్‌తో సహా మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నాం.

– ఎస్.వరహానరసింహారావు, ఇన్‌స్ట్రక్టర్

సౌకర్యాలతో కూడిన శిక్షణ

ఇక్కడి విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన శిక్షణ అందిస్తున్నాం. ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో పాటు కంప్యూటర్ ల్యాబ్‌లలో ట్రైనింగ్ ఇస్తున్నాం. శిక్షణ అనంతరం ఉపాధి కల్పిస్తున్నాం.

– సనపల వెంకటరమణమూర్తి, జిల్లా జాబ్స్ మేనేజర్

పర్యాటక రంగంపై మక్కువ పెంచుకోవాలి



విద్యార్థికి మొమెంటో అందజేస్తున్న నటుకుల మోహన్

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు పర్యాటక రంగంపై మక్కువ పెంచుకోవాలని సథరన్ ట్రావెల్స్ అధినేత సీహెచ్ ఉత్తమ కుమార్ సూచించారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల విద్యార్థులు సథరన్ ట్రావెల్స్ సంస్థను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రావెల్ ఏజెన్సీ చరిత్ర, ట్రావెల్స్ అందించే సేవలను అందరూ తప్పక తెలుసుకోవాలని సూచించారు. లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు, ఎయిర్ ట్రావెల్ అసోసియేషన్ నటుకుల మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు పర్యాటక రంగంపై మక్కువ పెంచుకోవాలని, పర్యాటకం గూర్చి, అందులో ఉండే ఉపాధి అవకాశాలను విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వివరించారు. పర్యాటక శాఖ ముఖ్య అధికారి ఎస్.నారాయణరావు మాట్లాడుతూ టూరిజం, సథరన్ ట్రావెల్స్ ఏవిధమైన సేవలు, అవకాశాలు కల్పిస్తుందని తెలియజేశారు. అనంతరం టూరిజంపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు పలు దేశాలకు చెందిన నమూనా మెమొంటోలను అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ పురుషుల కళాశాల అధ్యాపకులు యు.ప్రతిష్ట, బి.వరలక్ష్మి, జె.రాజు, వి.శ్రీఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో యువతి

శ్రీకాకుళం రూరల్: ఒక దొంగతనం కేసులో ముద్దాయిగా పట్టుబడి, పోలీసుల కళ్లుగప్పి తప్పించు పారిపోయిన యువతిని ఎట్టకేలకు శ్రీకాకుళం రూరల్ పోలీసులు బుధవారం రాత్రి పెదపాడు పరిసర ప్రాంతంలో పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. నరసన్నపేట మండలం కొత్తపోలవలస గ్రామానికి చెందిన మామిడి గౌతమి జెమ్స్ ఆస్పత్రిలో నర్సింగ్ కోర్సుల్లో జాయిన్ అయ్యి కొన్ని నెలల చదివి మానేసింది. ఈ నేపథ్యంలో ఆమెకు ఉన్న పరిచయాలతో స్థానికంగా ఉన్నటువంటి ఒక ప్రైవేట్ హాస్టల్‌లోకి ప్రవేశించి రెండు సెల్‌ఫోన్లు, ఒక ట్రాలీబ్యాగ్‌ను దొంగలించినట్లు సీసీ కెమెరాలో రికార్డయ్యింది. దీంతో ఆమెను స్థానికులు పట్టుకున్నారు. బలగ ప్రాంతానికి చెందిన ఆశిష్‌కుమార్ నాలుగు రోజులు క్రితం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే విధి నిర్వహణలో ఉన్న పోలీసుల కళ్లుగప్పి ఆమె అక్కడి నుంచి మెల్లగా జారుకుంది. కాగా బుధవారం పెదపాడు బ్రిడ్జి జంక్షన్ వద్ద ఆమెను రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి దొంగిలించిన రెండు సెల్‌ఫోన్లు, ఒక బ్యాగుతో పాటు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగిలించిన మరో ల్యాప్‌టాప్‌ను సైతం రికవరీ చేసినట్లు రూరల్ ఎస్ఐ రాము తెలిపారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జి.సిగడాం: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి యర్రా శారద అన్నారు. మండలంలోని డీఆర్‌వలస, బాతువ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తుఫాన్‌పై రైతులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు తమ పంట పొలాల్లో పంట వేసుకునే ముందు వ్యవసాయ శాఖాధికారుల సూచనలు, సలహాలు తీసుకోవడం మంచిదన్నారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించే దిశగా రైతులు పంటలను సాగు చేసుకోవాలన్నారు. వరి సాగులో కాలిబాటలు తీసుకోవడం వలన పంట దిగుబడులు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు డబ్బాడ ఆదినారాయణ, కుమరాపు శ్రీనివాసరావు, నాయకులు కుమరాపు రవికుమార్, కుమరాపు అప్పన్న, కూర్మారావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎం.సంతోష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫరీదుపేటలో మెగా వైద్య శిబిరం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ఫరీదుపేట గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం మెగా వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్టు జెమ్స్ వైద్య బృందం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. కార్డిక్, జనరల్ మెడిసిన్, సర్జరీ, ఆప్తమాలజీ సేవలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామని వైద్యులు విజయకుమార్, దినేష్ కుమార్, శోభన్, లక్ష్మి తెలిపారు. అలాగే గ్రామ యువత రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఒకరి రక్తదానంతో మరొకరి ప్రాణం కాపాడవచ్చన్నారు.

ధర్మాన పరామర్శ



అజిత్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఎల్‌బీఎస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారపు అజిత్‌కుమార్ తండ్రి ద్వారపు గోపాలరావు మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు బుధవారం ద్వారపు అజిత్‌కుమార్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయనతో పాటు చల్లా రవికుమార్, గొండు కృష్ణమూర్తి, నాగావళి కృష్ణ, శిమ్మ రాజశేఖర్, సుంకరి కృష్ణ, ఎంఏ రఫీ, పిల్లల నీలాద్రి, రొక్కం సూర్యప్రకాశరావు, ఎంఏ బేగ్, రుప్ప అప్పలసూరి, తంగి శివప్రసాద్, కొంక్యాణ సుభాష్ ఉన్నారు.

ఓపెన్ హౌస్

శ్రీకాకుళం క్రైమ్: పోలీసు అమరవీరుల సంస్మరణోత్సవాల్లో భాగంగా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు నగరంలోని మహిళా, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పోలీసుల విధులు, రిసెప్షన్, లాకప్ రూమ్, రికార్డుల నిర్వహణ, స్టేషన్ మ్యాప్, ఆయుధాలు, చట్టాల గురించి వివరించారు. ఇరుస్టేషన్ల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి



రణస్థలం: లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రమణ



జి.సిగడాం: సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్‌బాబు

జి.సిగడాం: తుఫాన్ కారణంగా గ్రామాల్లో నియమించిన అధికారులు, వైద్య సిబ్బంది, వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల పరిషత్ ప్రత్యేకాధికారి రాజేంద్రప్రసాద్‌బాబు స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు, రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ ఒక్కరూ అంకితభావంతో పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రామకృష్ణ, వైద్యాధికారి పేకల సుమబిందు తదితరుల పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: మత్స్యకార గ్రామాల్లో దానా తుపానుపై అప్రమత్తంగా ఉండాలని ఎచ్చెర్ల తహసీల్దార్ ఎ.సింహాచలం సూచించారు. మండలంలోని బడివానిపేట, బుడగుట్లపాలెం, డి.మత్స్యలేశం, బొంతలకోడూరు గ్రామాల వీర్వోలు, గ్రామ కార్యదర్శులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. మూడు రోజుల పాటు హెచ్చరికలు నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని, గ్రామాల్లో తుపాను షెల్టర్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. భారీ వర్షాలు, తీరంలో గాలులు వీచే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలన్నారు.

రణస్థలం: అల్పపీడనం ప్రభావంతో సముద్ర తీర ప్రాంతాల్లో అలజడిగా మారనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌పీవో, మండల ప్రత్యేకాధికారి ఐవీ రమణ సూచించారు. మండలంలోని కోటపాలెం విజయరామ చెరువు అనకట్టను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుఫాన్ తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు, సముద్ర తీర మత్స్యకారులు, పూరిళ్లులో ఉన్న ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు సూచించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్.శ్రీధర్, సర్పంచ్ గొర్లె జగదీష్, మాజీ సర్పంచ్ సుంకర ధనుంజయ తదితరుల ఉన్నారు.

అద్దె భవనాలే శరణ్యం



ప్రజలందరికీ శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నిరంతరం అందుబాటులో ఉండాలనే ఆలోచనతో కార్యాలయానికి ఆనుకొని క్వార్టర్స్‌ని నిర్మించారు. అయితే ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకి చేరడంతో గత 15 ఏళ్లుగా కమిషనర్లు ఎవరూ ఈ క్వార్టర్స్‌లో నివాసం ఉండడం లేదు. అందరూ బయట అద్దె భవనాల్లోనే ఉంటున్నారు. దీంతో ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి కమిషనర్ క్వార్టర్స్ నూతన భవనం నిర్మిస్తే, అందరికీ అందుబాటులో ఉండే అవకాశం ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

పలకలు సరిచేయరూ..!



కాలువపై పలకలు సరిలేక ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. నగరంలోని నక్కవీధి నుంచి హౌసింగ్ బోర్డు కాలనీ వైపు వెళ్లే రోడ్డు వద్ద ఇటీవల కాలవ పనులు చేపట్టారు. అయితే అక్కడ పనిచేసేందుకు కాలవపై పలకలను తొలగించారు. తిరిగి ఏర్పాటు చేసినపుడు వాటిని సరిగా అమర్చకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో వీటిని సరిచేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

తవ్వారు.. వదిలేశారు



మండల పరిధిలోని చాపురం పంచాయతీ చాపురం గ్రామంలో సుజల ధార పేరిట ఇంటింటికీ ఏర్పాటు చేయబోయే పైపు లైను కోసం గ్రామం వెంబడి గోతులు తవ్వేశారు తప్ప వాటిని ఇప్పటివరకూ పూడ్చలేదు. దీంతో గ్రామస్తులతో పాటు సచివాలయానికి వివిధ పనులు మీద వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైపులైన్లు అనుసరించి పక్కనే గల వాటర్ ట్యాంకు వద్ద పెద్ద గోతులను తీసి అలాగే వదిలేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు వీటిపై దృష్టి సారించి గోతులను కప్పాలని పలువురు కోరుతున్నారు.

– శ్రీకాకుళం రూరల్

ప్రమాదకరం



ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులు పుట్ బోర్డులపై నిలబడి ప్రయాణించడం ప్రమాదకరంగా మారుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు ఇంటి నుంచి పాఠశాలలు, కళాశాలలకు రాకపోకలు సాగించే సమయంలో బస్సులు ఫుల్ అవుతుండడంతో ఫుట్‌బోర్డులపై ప్రయాణం చేసి ప్రమాదాల బారిన పడుతున్నారు. అందువలన అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– శ్రీకాకుళం అర్బన్

క్రీడలతో మానసికోల్లాసం



గెలిపొందిన జట్టుకు షీల్డు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్

రణస్థలం:

క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాతర్లపల్లి గ్రామంలో అసిరితల్లి ఉత్సవాలు సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్ సౌజన్యంతో జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నీ బుధవారం నిర్వహించారు. ఈ టోర్నీలో 20 జట్లు పాల్గొనగా పలాస జట్టు ప్రథమ బహుమతి, లావేరు ద్వితీయ బహుమతి, పాతర్లపల్లి తృతీయ బహుమతులు గెలుచుకున్నాయి. ఆయా జట్లుకు నగదుతో పాటు షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయి కుమార్, పాతర్లపల్లి సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, నాయకులు మహంతి వెంకటప్పలనాయుడు, గొర్లె సీతారాం, నేతల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం జిల్లా స్థాయి అంబేడ్కర్ గురుకుల పాఠశాలల సైన్స్, మ్యాథ్స్, సోషల్, క్రాఫ్ట వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. తొమ్మిది పాఠశాలల విద్యార్థులు తమ ప్రాజెక్టులు ప్రదర్శించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో ఈ ప్రదర్శనలు నిర్వహించారు. విజేతలు ఈనెల 28, 29 తేదీల్లో జరిగే జోనల్ పోటీల్లో పాల్గొంటారు. గురుకుల కో–ఆర్డినేటర్ బాలాజీ, స్థానిక ప్రిన్సిపాల్ పద్మజ, ఉపాధి కల్పన అధికారి సుధ, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు తదితరులు హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

నీమాస్త్రంపై అవగాహన



కషాయాల తయారీపై శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: తెగుళ్ల నియంత్రణలో కీలకమైన నీమాస్త్రం తయారీపై ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మెట్టపేట గ్రామంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నీమాస్త్రం తయారీ, వినియోగంపై అవగాహన కల్పించారు. రీసోర్స్ పర్సన్ చంద్రకళ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. వరి, కూరగాయలు వంటి పంటలకు కషాయాలు వాడటం వల్ల పూర్తిగా తెగుళ్ల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. పంట ప్రారంభం నుంచి 20 రోజులు, 45 రోజులు, 60 రోజుల వ్యవధిలో కషాయాలు వినియోగించాలన్నారు.

సంక్షిప్తంగా...

చెరుకు తోట దగ్ధం

రణస్థలం: మండలంలోని రణస్థలం పంచాయతీలో ఉన్న నగరపాలేం గ్రామ సమీపంలో విద్యుత్ వైర్లు వలన బుధవారం ఉదయం 11 గంటల సమయంలో మంటలు వ్యాపించి చెరుకు తోట దగ్ధమైంది. దీంతో రైతు కరిమజ్జి భాస్కరరావుకు సుమారు రూ.60 వేలు నష్టం వాటిల్లింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

ఆర్థిక సాయం అందజేత

ఎచ్చెర్ల: లావేరు మండలం అదపాక గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు దుక్క భాస్కరరావు నిర్మాణ పనులను చేపడుతుండగా రెండు నెలల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబానికి బుధవారం పిలుపు స్వచ్ఛంద సంస్థ చైర్మన్ జి.రవికుమార్ సహకారంతో యూఎస్ఏలోని సహృదయ ఫౌండేషన్ చైర్మన్ బిందు రూ.10 వేల చెక్కు అందజేశారు.

గ్రామ సభలతో భూ సమస్యల పరిష్కారం

జి.సిగడాం: గ్రామసభల ద్వారా భూ రీసర్వేలో రైతులకు నెలకున్న భూ సమస్యల పరిష్కారం జరుగుతుందని, వీటిని రైతులు సద్వినియోగించుకోవాలని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ గాయత్రి అన్నారు. మండలంలోని అబోతులపేట గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొన్నారు. ఎవరికైనా వన్–బీ రాకపోతే తక్షణమే ఆ గ్రామ వీఆర్వోకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాధ, సర్వేయర్ మెట్ట శ్రీరామ్మూర్తి, మొయ్యి ఈశ్వరరావు, రాజు, వీఆర్వో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'మా భూములు మాకు అప్పగించండి'

జి.సిగడాం: మండలంలోని సేతుభీమవరం గ్రామంలో సుమారుగా 6 వందల ఎకరాల ఈనాం భూములు ఉన్నాయని, ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని తక్షణమే ఆ భూముల వన్–బీ ఆన్‌లైన్‌లో వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని సేతుభీమవరం గ్రామ రైతులు వాపోయారు. ఈ మేరకు తహసీల్దార్ ఎం.శ్రీకాంత్‌కు గ్రామ సచివాలయంలో వినతిపత్రం బుధవారం అందించారు. గ్రామంలో ఈనాం భూములతో సుమారుగా 3 వందల కుటుంబాలు జీవిస్తున్నాయని వెల్లడించారు. భూములు సాగు చేస్తున్నా పాసు పుస్తకాలు లేక, ఆన్‌లైన్‌లో వన్–బీ రాకపోవడంతో బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయడం లేదన్నారు. తక్షణమే తమ సాగులో ఉన్న భూములు మాకు ఆన్‌లైన్‌లో వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.